క్లుప్తంగా

మందకృష్ణకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగను సంఘం మండల నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఈదయ్య, పగిడిపల్లి బాబు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తోళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో ఉన్న రెండు అనాథ మృతదేహాలకు అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల మృతిచెందిన యాచకుడు, గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాలను పోలీసులు మార్చురీ భద్రపరిచారు. మృతదేహాలకు కోసం ఎవరూ రాకపోవడంతో పోలీసులు ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రాదేశిక ఎన్నికల అధికారులకు శిక్షణ

ఖమ్మంమస్‌టౌన్: ప్రాదేశిక ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ప్రాదేశిక ఎన్నికల తొలివిడతలో పాల్గొననున్న మొత్తం 132 మంది శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి పీజీ హెచ్‌ఎంలు శైలేంద్ర, డీ సత్యనారాయణలు పీపీటీ ప్రజేంటేషన్ ద్వారా, క్షేత్ర స్థాయిలో ఎలా చేయాలో బ్యాలెట్ బాక్సులను సైతం చూపిస్తూ సమగ్రంగా ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల శిక్షణలో పాల్గొన్న 11మందితో కలిపి మిగిలిన 140 మందికి ఈ రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

నేలకొండపల్లి: కోళ్లఫామ్‌ల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు సూచించారు. నేలకొండపల్లి తహసీల్‌లో బుధవారం ఆయన నిర్వాహకులతో సమావేశమయ్యారు. కొన్ని రాష్ట్రాల్లో కోళ్లకు వైరస్ సోకుతున్న నేపథ్యాన బయటి నుంచి కోళ్లను తీసుకోవద్దని, ఏ కారణంతోనైనా ఫామ్‌లో కోళ్లు చనిపోతే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే, ఫాం పరిసరాలు, కార్మికుల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జె.మాణిక్‌రావ్, ఎంఆర్‌ఐ ఆలస్యం మధుసూదన్‌రావు, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు భువనేశ్వర్, సాహితీ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
వినోద	తండేల్
సాయిరాం	డాకు మహారాజ్
ఆదిత్య	గేమ్ చేంజర్
శ్రీనివాస	డాకు మహారాజ్
సినీ గెలాక్సీ	ఏజెంట్ గై 001

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	44	పాలకూర	3
పచ్చిమిర్చి	26		20
కాకర	44	చుక్కకూర	3
బీర	44		20
దొండ	28	తోటకూర	2
పొట్లకాయ	34		10
చిక్కుడు	44	గోంగూర	4
గోరుచిక్కుడు	48		10
క్యాబేజీ	20	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	48		40
క్యారెట్	52	పుదీన	1
క్యాప్సికం	54		25
బీట్‌రూట్	34	-ఖమ్మం వ్యవసాయం	

ఆన్‌లైన్‌లో 'ప్రజాపాలన'

కేఎంసీ పరిధిలో దరఖాస్తుల నమోదు

- రెండోదఫా అందిన దరఖాస్తుల్లో అర్హుల గుర్తింపుపై దృష్టి
- ఎన్నికల కోడ్ అనంతరం జాబితా ప్రకటించే అవకాశం



దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాలకు సంబంధించి ప్రజలు చేసుకున్న దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. గత నెలలో జరిగిన ప్రజాపాలన సభల్లో ప్రకటించిన జాబితాల్లో తమ పేర్లు రాలేదని అనేక మంది ఆవేదన చెందారు. దీంతో ప్రజాపాలన వార్డు సభల్లో మరోసారి లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ మేరకు పెద్దసంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం మరోసారి దరఖాస్తులు అందజేశారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్ల నుండి మొత్తం 6,200 దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటన్నింటిని డివిజన్ల వారీగా విడదీసి భద్రపరిచారు. తాజాగా వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

యాప్ ద్వారా..

నాలుగు పథకాలకు అర్హులైనప్పటికీ తమ పేర్లు అర్హుల జాబితాలో రాలేదంటూ వందలాది మంది ప్రజాపాలన వార్డు సభల్లో నిరసన తెలపగా ప్రజల నుండి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. తాజాగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశాలతో కేఎంసీ పరిధిలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. సిబ్బంది కంప్యూటర్‌లో నమోదు చేసిన వివరాలన్నింటినీ 360 డిగ్రీ యాప్‌లోకి డంప్ చేస్తారు. తద్వారా అర్హులెవరో అధికారులు గుర్తించడం సులువవుతుందని చెబుతున్నారు. అర్హులందరికీ ఎన్నికల కోడ్ ముగిశాక తర్వాత కొత్త రేషన్‌కార్డులతో పాటు మిగిలిన పథకాలను అమలు చేయనున్నట్లు సమాచారం.

ఒక్కొక్కరు మూడు, నాలుగు దరఖాస్తులు

రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలన చేయకపోవడంతో ఒక్కో కుటుంబం రెండు మూడు సార్లు దరఖాస్తు చేస్తున్నారు. గతంలో మీ సేవల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇక ఇటీవల జరిగిన వార్డు సభల్లోనూ మరోసారి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిసింది. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే దరఖాస్తుల సంఖ్య తగ్గుతుందని భావిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో మరోసారి కొత్త దరఖాస్తు ఇచ్చే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

40 మందితో..

నగరంలోని 60 డివిజన్ల పరిధిలో 6,200 దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటిని కంప్యూటర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు కేఎంసీ కంప్యూటర్ ఆపరేటర్లకు బాధ్యతలను అప్పగిస్తున్నారు. తొలిరోజు సోమవారం 20 మంది ఆపరేటర్లతో ఈ ప్రక్రియ చేయిస్తుండగా.. మంగళవారం మరో 20 మంది వార్డు ఆఫీసర్లనూ కేటాయించారు. ఈ అంశంపై అదనపు కలెక్టర్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. కాగా, దరఖాస్తుల నమోదు ప్రక్రియను కేఎంసీ అసిసెంట్ కమిషనర్, ఖమ్మం అర్బన్ తహసీల్, డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షించనున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

కూసుమంచి: శ్రీ వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జీళ్లచెరువు దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణం కన్నులపండువగా సాగింది. యాజ్ఞికులు వెలగలేటి రామానుజాచార్యులు, సహాయకులు చిలకమర్రి స్వామినాథ్ ఆచార్యుల ఆధ్వర్యాన అర్చక బృందం స్వామి కల్యాణాన్ని వైభవోపేతంగా జరిపించారు. వివిధ గ్రామాల ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. అనంతరం సాయంత్రం గ్రామ వీధుల్లో శ్రీవారి ఊరేగింపు నిర్వహించారు. నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన భక్తులు చెరువు సందీప్‌రావు, సాయినిశ్చల దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను అందజేయటంతో పాటు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, స్వర్ణకుమారి తదితరులు పాల్గొని కళ్యాణాన్ని వీక్షించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలో ఆలయ చైర్మన్ అంబాల వెంకటలక్ష్మి, ఈఓ జగన్‌మోహన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు రాధమ్మ, శేఖర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకన్న, రామారావు పాల్గొన్నారు.

రోడ్ల వెంట వ్యాపారాలు చేయొద్దు



వీధి వ్యాపారులకు సూచిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఐటీ హబ్ వరకు, ఐటీ హబ్ నుంచి రోటరీనగర్ వరకు రోడ్ల వెంట నిర్వహిస్తున్న వీధి వ్యాపారాలను కేఎంసీ అధికారులు డీఆర్‌ఎఫ్ సిబ్బందితో బుధవారం తొలగించారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ సిబ్బంది తోపుడుబండ్లను, పండ్ల వ్యాపారులను, ఇతర వ్యాపారులను అక్కడ నుండి తొలగించారు. రోడ్ల వెంట వీధి వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, రోడ్ల వెంట వ్యాపారాలు చేయొద్దని, వీధి వ్యాపార ప్రాంగణాల్లో వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక, టీపీఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి



రికార్డులు పరిశీలిస్తున్న రమేష్

నేలకొండపల్లి: ప్రభుత్వ స్థలాలను గుర్తించి గ్రామాల వారీగా జాబితాను సిద్ధం చేయాలని పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమేష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించి ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఎక్కడైనా ఆక్రమణకు గురయ్యాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ భూముల ప్రస్తుత స్థితిని క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్ రావు, బీ.రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఆందోళనలు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ కులగణనలో మున్నూరు కాపుల జనాభాను తగ్గించి చూపడం సరికాదని మున్నూరు కాపు సంఘం నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని మున్నూరు కాపు వసతిగృహంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పార్టీలకతీతంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 14న కలెక్టర్‌కు, 17న ముదిగొండ తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందులో బీసీ కులాల బాధ్యులు కలిసి రావాలని కోరారు. ఈ సమావేశంలో పొదిల రవికుమార్, కొత్తా సీతారాములు, నరాల నరేష్, మేకల శ్రీనివాస్, మేకల నాగేందర్, జంగిలి రమణ, సత్యాల మధు, మూలగుండ్ల శ్రీహరి, పసుపులేటి నాసరయ్య, వెంకట్, రాపర్తి రాజా, జీవీవీఎల్ నరసింహారావు, మాటేటి కిరణ్, శ్రీను, పగడాల నరేందర్, తిరుమలశెట్టి జయప్రకాష్, బొమ్మిశెట్టి రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బిషప్, ఫాదర్లు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటలో కరుణగిరి చర్చిలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ నగిలి ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాల్లో కరుణగిరి ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు.

అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలి

కూసుమంచి: నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేయాలని బీజేపీ నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామసభల్లో చదివిన జాబితాల్లోని పేర్లను కూడా కొందరు స్థానిక నాయకుల ఒత్తిడితో మార్చారని, జాబితాల్లో నిజమైన అర్హుల పేర్లు లేవన్నారు.

మోహన్ భగవత్ వాఖ్యలు గర్హనీయం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వాఖ్యలు దేశ పౌరులందరిని కించపరిచే విధంగా ఉందని, వెంటనే దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ పిలుపునిచ్చారు. భారతదేశ పతాకాన్ని గౌరవించని ఈ సంస్థ ఉగ్రవాద సంస్థల కంటే ప్రమాదకరంగా ఉందని, వీరిపై వెంటనే చర్యలు తీసుకుని దేశద్రోహం కేసు నమోదు చేసి బహిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంజయ్, దినేష్, గణేష్, నిగ్నేష, రఫీ, అజయ్, ఆరిఫ్, ఫయాజ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రఘునాథపాలెం: మండలంలోని గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపం వల్ల కలిగే నష్టం గురించి బుధవారం కళాజాతతో అవగాహన కల్పించారు. గ్లోబల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలో రఘునాథపాలెం, వి.వెంకటాయపాలెం, వేపకుంట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో కళాజాత నిర్వహించారు. అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధులు, అయోడిన్‌తో కలిగే ఉపయోగాలను కళాకారులు పాటలు, మాటల రూపంలో తెలిపారు. సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ నాగఫణి, సిబ్బంది నవీన్, కళాకారులు పుల్లారావు, చంద్రమోహన్, సత్యనారాయణ, విజయ్, శాంతి ఉన్నారు.

ఇంజనీరింగ్ ఫలితాల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: జేఎన్‌టీయూ హైదరాబాద్ విడుదల చేసిన ఇంజనీరింగ్ రెండో ఏడాది మొదటి సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఖమ్మంలోని బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఏటా 80 శాతానికి పైగా ఫలితాలు నమోదవుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్‌తో పాటు వైస్‌చైర్మన్ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ బిక్షం, కిరణ్‌జ్యోతి, హెచ్‌ఓడీ వరప్రసాద్ తదితరులు అభినందించారు.

పట్టణ ఉపాధి హామీ తీసుకురావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరావు

ఖమ్మం మామిళ్లగూడెం: నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఉపాధి పనులు కొనసాగిస్తూ పట్టణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావాలని, భూమి లేని వ్యవసాయ కార్మిక కుటుంబానికి రూ.12వేలు ఇస్తానని హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హామీలిచ్చి ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయటంలో విఫలమైందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పగిళ్ల వీరభద్రం, సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు, వీరయ్య ఉన్నారు.

టీఎన్జీవోస్ డైరీ ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా డైరీ–2025ని టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.హుస్సేనీ ముజీబ్‌లు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, శ్రీనివాస్, కేంద్ర సంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరనేని రామారావు, భార్గవ్ చైతన్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి సబ్‌స్టేషన్ నెహ్రూనగర్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేకలబండ పార్కు–2, బొడ్రాయి ఏరియా, వైరా రోడ్డులో వినాయక హాస్పిటల్ ఏరియా, బోగంకుంట, నిజాంపేటల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

క్యాథల్యాబ్ యంత్రానికి నిలిచిన విద్యుత్ సరఫరా

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం పెద్దాస్పత్రిలోని క్యాథల్యాబ్ యంత్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా సరఫరా లేక గుండె సంబంధిత బాధితులకు చికిత్సలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. క్యాథల్యాబ్ యంత్రానికి విద్యుత్ సరఫరా చేసే పవర్ ప్యానల్ మరమ్మతుకు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో యాంజియోగ్రామ్, స్టంట్స్ తదితర సేవలు అందించలేక బాధితులను వెనక్కి పంపిస్తున్నారు. పవర్‌ప్యానల్ మరమ్మతుకు రూ.10వేల లోపే ఖర్చవుతుందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

విద్యాశాఖకు మంత్రిని నియమిస్తేనే మేలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమిస్తేనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యారంగం సమస్యలకు నిలయంగా మారిందన్నారు. ఇకనైనా మంత్రిని నియమించి రానున్న బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కోసం కృషి చేయడమే కాక 5, 6 తరగతుల్లో డిటెన్షన్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వినయ్, పృథ్వీ, సాదిక్, సందీప్, యశ్వంత్, నసీర్, వెంకటేష్, అశోక్ ఉన్నారు.

మరుగుదొడ్డి తొలగింపు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఎస్సీ కాలనీలో ప్రభుత్వ స్థలంలో నిర్వహించిన మరుగుదొడ్డిని అధికారులు బుధవారం తొలగించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మరుగుదొడ్డిని నిర్మించడంతో మంజూరైన సీసీ రోడ్డును వేయడానికి ఇబ్బందికరంగా మారడంతో స్థానికులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేయగా ఎంపీఓ సీహెచ్.శివ మరగుదొడ్డిని తొలగించారు. ఈ క్రమంలో బాధితులు అడ్డగించగా పోలీసులు జోక్యం చేసుకుని వారిని సముదాయించారు.

సేవాలాల్ జయంతి ఘనంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికిరణ్

ఖమ్మంఅర్బన్: సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, సమితి సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఆచార వ్యవహారాలు పాటించి సాంప్రదాయంగా జరుపుకోవాలని సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ రవి కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్‌లో ఉత్సవాలపై సేవాలాల్ సేన నాయకులతో సమావేశం నిర్వహించారు. సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 21 వరకు నగరంలో ఉన్న సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పార్టీలకు అతీతంగా జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. గుగులోత్ రాజ్ కుమార్, సురేష్, మణికంఠ, రాఘవేంద్ర, నరేష్, బిక్కు, వెంకన్న, సూర్య పాల్గొన్నారు.

ప్రతీ కూలీకి ఆత్మీయ భరోసా అందించాలి



మాట్లాడుతున్న హన్మంతరావు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ వ్యవసాయ కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పండితాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడగా నరసయ్య, ఆవుల మంగతాయి, పాపారావు, రాజు, శంకర్ ఉన్నారు.

హక్కులు కల్పించాలి

ఖమ్మంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని టీయూసీఐ పాలేరు ఏరియా కమిటీ అధ్యక్షుడు గోస్ పుల్లయ్య అన్నారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బడ్జెట్ కార్మిక వర్గానికి తీవ్ర నిరాశ కల్పించిందన్నారు. రాందాస్, ఉపేందర్, లెనిన్, సైదులు, మాధవరావు ఉన్నారు.

1104 సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో యూనియన్ ప్రతినిధులు, సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ స్థాపించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం యూనియన్ కార్యాలయంలో డిస్కం కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరి రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు, హక్కుల కోసం ఉద్యమించి అనేక సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ, ప్రస్తుత ప్రతినిధులు ఇబ్రహీం, సీతారాంరెడ్డి, సత్యనారాయణరావు, శోభనాద్రి, జిల్లా అధ్యక్షుడు ఎంవీ.రమణారెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షులు జీఎల్‌వీ. రావు, సీతారామయ్య, సురేష్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, చారి, మంజుల, మాధవి, మల్లమ్మ, రాణి, రాజ్యలక్ష్మీ, గీత, కనక దుర్గ భవాని పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు ప్రతిభే గీటురాయి



ఖమ్మం సహకారనగర్: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ శైలజా లక్ష్మి తదితరులు



తిరుమలాయపాలెం: బహుమతులతో విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల భవితకు పోటీ పరీక్షలు దోహదమని, ఇందులో చూపిన ప్రతిభే భవిష్యత్‌కు గీటురాయని ఖమ్మం అర్బన్ ఎంఈఓ కెవి శైలజా లక్ష్మీ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిబాపాటవ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, పెన్షనర్ల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పిండిప్రోలు పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ప్రతిభా పాటవ పరీక్ష పోటీల్లో మండలంలోని జల్లెపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కె.మనీష్‌కుమార్, ద్వితీయ బహుమతి కె.సింధు, తృతీయ బహుమతి కౌషిక్ సాధించారు. ఎంఈఓ శ్రీనివాసరావు, ట్రస్ట్ నిర్వాహకులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, హెచ్‌ఎం ధారా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.